క్లుప్తంగా

వన సంరక్షణ మహోత్సవం



వేమగిరిలో మొక్కలు నాటుతున్న ప్రముఖులు

కడియం: వన సంరక్షణ మన సంరక్షణేనని పలువురు వక్తలు అన్నారు. వన సంరక్షణ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా వేమగిరితోటలో శనివారం కార్యక్రమం నిర్వహించారు. స్థానిక నాయకులు చెల్లుబోయిన శ్రీనివాస్, నాగబాబు, చక్రవర్తి, బృందావనం హెల్పింగ్ హాండ్స్ ప్రతినిధులు నవీన్, పిరమిడ్ మాస్టర్స్ ప్రతినిధులు రాయ జగపతిరాజు తదితరులు పాల్గొని మొక్కల సంరక్షణ ప్రాధాన్యతను వివరించారు. అలాగే ప్రతి ఇంటికి సంబంధిత వివరాలతో కూడిన పోస్టర్, తులసి మొక్కను అందించారు. అలాగే మొక్కలను నాటారు.

5 నుంచి ప్రత్యేక పూజలు

కడియం: దుళ్లలోని రుక్మిణీ సత్యభామా సమేత మదన గోపాలస్వామి ఆలయంలో ఈ నెల 5 నుంచి వచ్చే నెల రెండో తేదీ వరకూ ప్రత్యేక పూజలు జరుగుతాయని ఆలయ భక్త బృందం తెలిపింది. 5న పూజా కార్యక్రమాలు ప్రారంభం అవుతాయని, 9, 16, 23, 30 తేదీల్లో అష్ట లక్ష్మీ పూజలు జరుగుతాయన్నారు. 19వ తేదీ శ్రావణ పూర్ణిమ సందర్భంగా విఖనస ఆచార్య స్వామి జయంతి, విశేష పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. 27న శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ప్రత్యేక పూజలు, ఉట్టి కొట్టడం, చిన్నారుల వేషధారణ ప్రదర్శన జరుగుతుందని వివరించారు.

బ్రిడ్జి సెంటర్‌లో సీసీ కెమెరాల ఏర్పాటు

కడియం: కెనాల్ రోడ్డుపై గల జేగురుపాడు బ్రిడ్జి సెంటర్‌లో సర్పంచ్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ చొరవతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. గ్రామస్తులందరూ ఈ సెంటర్ మీదుగానే ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. నిత్యం ఈ రోడ్డు రద్దీగా ఉంటుంది. ఈ నేపథ్యంలో భద్రత కోసం వీటిని ఏర్పాటు చేసినట్లు స్టాలిన్ తెలిపారు. అంతే కాకుండా చోరీలు, ప్రమాదాల సమయంలో నిందితుల ఆచూకీ తెలుసుకునేందుకు తోడ్పడతాయన్నారు. గతంలో కూడా విలువైన పశువులు, ఇతర వస్తువులు పోయినప్పుడు తగిన ఆధారాల్లేక పోవడంతో కొన్ని కేసుల్లో నిందితులు దొరకలేదన్నారు. ఈ నేపథ్యంలో పోలీసు అధికారుల సూచన మేరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

అంతర్జాతీయ వెబినార్

కంబాలచెరువు: స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలోని కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో శనివారం 'కోవిడ్-19 వ్యాక్సిన్ ఇన్ సైడ్స్ అండ్ అప్ డేట్స్' అనే అంశంపై అంతర్జాతీయ వెబినార్ నిర్వహించారు. రిసోర్స్ పర్సన్లుగా డాక్టర్ సూరిబాబు ఆకుల (యుఎస్‌ఏ), డాక్టర్ వీవీ దుర్గాప్రసాద్ (రాజమహేంద్రవరం ప్రభుత్వం వైద్యకళాశాల) పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవ కుమారి ప్రారంభించిన ఈ కార్యక్రమంలో దాదాపు 140 మంది పాల్గొన్నారు.

130 మందికి ఉద్యోగాలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక ఆర్ట్స్ కళాశాలలో శనివారం నిర్వహించిన జాబ్ మేళాలో 130 మందికి ఉద్యోగాలు లభించాయి. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే మాట్లాడుతూ జాబ్‌మేళాకు జిల్లాలోని వివిధ కళాశాలల నుంచి 182 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కళాశాల జేకేసీ కోఆర్డినేటర్ డాక్టర్ బి.హరినాథ్‌రెడ్డి మాట్లాడుతూ పది కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరై.. విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారన్నారు.

మత్స్యకార కుటుంబానికి సాయం

సీటీఆర్ఐ: నిడదవోలు నియోజకవర్గం తీరుగూడెం గ్రామంలో ఎర్రకాలువ వరద ఉధృతికి మృతి చెందిన మత్స్యకారుడు ఘంటసాల వెంకటేశు కుటుంబానికి తక్షణ సాయంగా మంత్రి కందుల దుర్గేష్ రూ.4 లక్షల చెక్కు అందించారు. ప్రభుత్వం రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా మంజూరు చేయగా, దానిలో రూ.4 లక్షలు వెంకటేశు భార్య పాపాయమ్మకు మంత్రి అందజేశారు. కలెక్టరేట్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ ప్రశాంతి, ఇన్‌చార్జి జేసీ జి.నరసింహులు, జిల్లా మత్స్యశాఖ అధికారి కేవీ కృష్ణారావు పాల్గొన్నారు.

గోకవరంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

గోకవరం: స్థానికంగా డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని పీడీఎస్‌యూ విజృంభణ ఆధ్వర్యంలో శనివారం ప్రదర్శన నిర్వహించారు. పీడీఎస్‌యూ విజృంభణ జిల్లా కార్యదర్శి శ్రీకాంత్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి ప్రధాన రహదారిపై ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సతీష్ మాట్లాడుతూ గోకవరంలో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేస్తే ఈ పరిసర ప్రాంతాల విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. గ్రామంలో డిగ్రీ కళాశాల లేకపోవడం వలన సుమారు 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న రాజమహేంద్రవరం, జగ్గంపేట, రంపచోడవరం వెళ్లి విద్యార్థులు చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.

వరద తగ్గింది.. బురద మిగిలింది

- అధ్వానంగా గోదావరి ఘాట్లు
- మెట్లపై పేరుకుపోయిన బురద



రామపాదాలరేవులో పేరుకుపోయిన మట్టి



ధవళేశ్వరం రామపాదాలరేవులోని మెట్లపై కనిపిస్తున్న బురద

ధవళేశ్వరం: భారీ వర్షాల నేపథ్యంలో వరదతో ఉగ్రరూపం చూపించిన గోదావరి ఎట్టకేలకు శాంతించింది. దాదాపు పదకొండు రోజులు వరద ఉధృతి కొనసాగింది. జిల్లాలోని లంక భూములన్నీ ముంపునకు గురయ్యాయి. గోదావరి వెంబడి ఉన్న స్నానఘాట్టాలపైకి వరద ప్రవాహం కొనసాగింది. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంది. స్నాన ఘట్టాల వద్ద ఎవ్వరూ వెళ్లకుండా రక్షణ ఏర్పాట్లు చేసింది. ప్రస్తుతం వరద నీరు తగ్గడంతో గోదావరి శాంతించింది. స్నాన ఘాట్టాలలోని మెట్లు ముంపు నుంచి బయటపడ్డాయి. అయితే అక్కడ పేరుకపోయిన బురదను చూసి ప్రజలు విస్తుబోతున్నారు. దానిలోంచి రేవుల్లోకి వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నారు.

ప్రజల అవస్థలు

ప్రస్తుతం స్నాన ఘట్టాల వద్ద సాధారణ పరిస్థితులు నెలకొన్నాయి. వరద పూర్తిగా తగ్గడంతో నీరు వెనక్కి లాగింది. దీంతో మెట్లపై బురద మట్టి, చెత్త పేరుకుపోయాయి. వరద ఉధృతి తగ్గడంతో స్నాన ఘట్టాల వద్ద స్నానాలు చేసేందుకు వచ్చినప్పటికీ ఘాట్లు బురదమయంగా మారడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వరద నేపథ్యంలో జూలై 22వ తేదీన కాటన్ బ్యారేజీ వద్ద మొదటి ప్రమాద హెచ్చరికను ప్రకటించారు. అప్పటి నుంచి శుక్రవారం అర్ధరాత్రి వరకు ప్రమాద స్థాయిలోనే గోదావరి ప్రవహించింది. ఒకానొక సమయంలో బ్యారేజీ వద్ద 16.14లక్షల క్యూసెక్కుల మిగులు జలాలను దిగువకు విడుదల చేశారు.

శుభ్రం చేయించాలని వినతి

వరదల కారణంగా రేవుల వద్ద గత పదకొండు రోజులుగా స్నానాలు చేయడాన్ని నిషేధించారు. స్నాన ఘట్టాల వద్ద బారికేడ్లు సైతం ఏర్పాటు చేశారు. స్నాన ఘట్టాల్లో ఎవరూ లోపలికి వెళ్లకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ప్రస్తుతం నీటి ఉధృతి తగ్గుముఖం పట్టడంతో సాధారణ పరిస్థితి నెలకొంది. శనివారం మిగులు జలాలు 5.81 లక్షల క్యూసెక్కులకు తగ్గాయి. స్థానిక రామపాదాల రేవు వద్ద ప్రతి పౌర్ణమికి గోదావరి హారతి సైతం ఇస్తారు. ఈ నేపథ్యంలో ఘాట్లను అధికారులు శుభ్రం చేయించాలని భక్తులు కోరుతున్నారు.

పేరుకుపోయిన మట్టి

నీటి ఉధృతి అధికంగా ఉండటంతో ఘాట్ల వద్ద మట్టితో పాటు నాచు కూడా పేరుకుపోయింది. ఎగువ నుంచి వచ్చి చేరిన బంక మట్టిని తొలగిస్తే భక్తులకు ఇబ్బందులు లేకుండా ఉంటుంది. మరో వైపు శ్రావణ మాసం సమీపిస్తుండటంతో అధిక సంఖ్యలో మహిళలు ధవళేశ్వరం రామపాదాలరేవులో పుణ్యస్నానాలు ఆచరించేందుకు వస్తుంటారు.

అన్ని రేవుల్లోనూ అదే పరిస్థితి

వరద ఉధృతి తగ్గుముఖం పట్టడంతో ధవళేశ్వరంలోని ప్రధాన ఘాట్లలో ఇదే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా ధవళేశ్వరం రామపాదాలరేవు, కంచర్ల లైన్ రేవు, పద్మావతి ఘాట్ తదితర ప్రాంతాల్లో మెట్లపై బురద పేరుకుపోయింది. వరదలో కొట్టుకువచ్చిన బురద, చెత్తను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రతి రోజూ గ్రామంలోని వందలాది మంది ఈ రేవుల్లో పుణ్య స్నానాలు ఆచరిస్తుంటారు. పండుగ పర్వదినాల్లో రేవులు భక్తులతో కిటకిటలాడతాయి.

స్వాతంత్య్ర వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

- అన్ని శాఖలూ సమన్వయంతో పనిచేయాలి
- అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం

సీటీఆర్ఐ: రాజమహేంద్రవరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఆగస్టు 15వ తేదీన స్వాతంత్య్ర దినోత్సవాన్ని అత్యంత ఘనంగా జరుపుకోవడానికి అన్ని శాఖలూ తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్‌లో అదనపు ఎస్పీ ఎస్ఆర్ రాజశేఖర్, ఇన్‌చార్జి జేసీ, డీఆర్వో జి.నరసింహులు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో వ్యవహరించి స్వాతంత్య్ర వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆయా శాఖల పరిధిలో అత్యుత్తమ సేవలందించిన వారి పేర్లనే అవార్డులకు సిఫారసు చేయాలని, వాటిని ఈ నెల 10వ తేదీలోగా పంపించాలన్నారు. వేడుకల్లో భాగంగా చిన్నారులు, విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించేలా సాంస్కృతిక కార్యక్రమాలను చేపట్టాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత పథకాలతో కూడిన శకటాల ప్రదర్శన, స్టాళ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి జరిగే స్వాతంత్య్ర వేడుకలకు జిల్లా ప్రజలు, స్వాతంత్య్ర సమరయోధుల కుటుంబ సభ్యులు, ఇతర ప్రముఖులు, ప్రతి ఒక్కరూ ఆహ్వానితులేనన్నారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ముందుగానే పారిశుధ్య పనులు చేపట్టాలని, వేడుకల రోజు అందరికీ సరిపడా తాగునీరు సమకూర్చాలన్నారు. పోలీసు, ఎన్‌సీసీ విభాగాల గార్డ్ ఆఫ్ ఆనర్, పరేడ్ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై దృష్టి సారించాలన్నారు. అధికారులు సమన్వయంతో పని చేసి వేడుకులకు వచ్చే అతిథులకు, సామాన్య ప్రజలకు, విద్యార్థులకు, చిన్నారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

108 ఆలయాలలో శ్రీనివాస కల్యాణాలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

సీటీఆర్ఐ: అమ్మఒడి సేవా తరంగిణి స్థాపించి 12 వసంతాలు పూర్తయిన సందర్భంగా ఏడాది పాటు రాజమహేంద్రవరం అర్బన్, రూరల్ ప్రాంతాల్లోని 108 ఆలయాల వద్ద ఉచితంగా శ్రీనివాస కల్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని స్థానిక ప్రెస్ క్లబ్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో సేవా తరంగిణి అధ్యక్షుడు విజయ స్వామి తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆసక్తి కలవారు 99890 32311, 85200 34741 నంబర్లకు కాల్ చేసి దరఖాస్తులను పొందాలని, వాటిని ఆగస్టు 31 లోపు పూర్తి చేసి, పంపించాలన్నారు. కార్యదర్శి శివ స్వామి మాట్లాడుతూ వచ్చిన దరఖాస్తులలో ఇప్పటి వరకు శ్రీనివాస కళ్యాణం జరగన వార్డులు, గ్రామాలలో ఉన్న చిన్న దేవాలయాలకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు తదితరులు ఈ కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, 108 కల్యాణాల స్వాగత సమితి అధ్యక్షులు హారిక నర్సిపల్లి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



తల్లిపాల విశిష్టతను తెలుపుతూ నిర్వహిస్తున్న ర్యాలీ

కంబాలచెరువు: బిడ్డలకు తల్లిపాలు అమృతమని రాజేంద్ర నగర్ ఏడో సచివాలయం మహిళా సంరక్షణ కార్యదర్శి ఎం.ప్రియదర్శిని అన్నారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా శనివారం రాజేంద్రనగర్ మెర్జ్ అంగన్ వాడీ కేంద్రం నుంచి తల్లిపాల విశిష్టతను తెలుపుతూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రియదర్శిని మాట్లాడుతూ తల్లిపాలలో వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని, బిడ్డకు త్వరగా జీర్ణమవుతాయన్నారు. కొలెస్ట్రామ్ అనే పదార్థం ఉండడం వల్ల పిల్లలు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తయారవుతారన్నారు. అలాగే తల్లిపాలతో తల్లీబిడ్డలకు అనుబంధం ఏర్పడుతుందని తెలిపారు. పాలు ఇవ్వడం వల్ల తల్లికి రొమ్ము, అండాశయ క్యాన్సర్లు రావన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం జహారా తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణపై నిర్లక్ష్యం వద్దు



హెల్మెట్ ధారణపై అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

కంబాలచెరువు: హెల్మెట్ ధరించడంపై వాహన చోదకులు నిర్లక్ష్య వైఖరి అవలంబించకూడదని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్ బాబు అన్నారు. ఆయన శనివారం మాట్లాడుతూ హెల్మెట్, సీటు బెల్ట్ ధారణపై ఎన్ని రకాలుగా చైతన్యం కలిగించే కార్యక్రమాలు చేపట్టినా ప్రజల నుంచి సరియైన స్పందన రాకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్ర ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ హెల్మెట్ ధారణపై తాండవ యోగేష్ వర్సెస్ ఆంధ్ర ప్రదేశ్ కేసు విషయంలో ఉత్తర్వులు జారీ చేశారన్నారు. రాష్ట్రంలో 3703 మోటార్ సైకిల్ వాహన ప్రమాదాలు జరిగితే అందులో 3047 మంది మరణించడం అత్యంత బాధకరమైన సంఘటనగా పేర్కొన్నారు. ఆగస్ట్ 4వ తేదీ నుంచి హెల్మెట్ ధారణ తప్పనిసరి చేస్తూ, అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రచారం చేపట్టేలా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చర్యలు తీసుకుందన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టి ఆమేరకు ప్రజల్లో చైతన్యం కలిగించే కార్యక్రమాలు చేపట్టామన్నారు.

అవగాహన ర్యాలీ

స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవ కుమారి ఆధ్వర్యంలో శనివారం హెల్మెట్ ధారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. శిరస్త్రాణం ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలు, ప్రాణాలకు ఎలాంటి రక్షణ కలుగుతుందో తెలుపుతూ విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. వైస్ ప్రిన్సిపాల్ కేఎస్ రత్నకుమార్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ బి.అనురాధ సూర్యకుమారి, ప్రోగ్రాం ఆఫీసర్లు కాస్మా, వీరలక్ష్మికుమారి, విజయలక్ష్మి, బి చంటమ్మ, వెంకాయమ్మ, కీర్తి కుమారి, ప్రియాంక పాల్గొన్నారు.

50 ఏళ్ల స్నేహం.. నేటి తరానికి ఆదర్శం



ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు

ధవళేశ్వరం: వారందరూ కలిసి చదువుకున్నారు. ఎవరి జీవితాలలో వారు బిజీగా మారారు. దాదాపు 50 ఏళ్ల తర్వాత శనివారం ధవళేశ్వరంలోని సర్ ఆర్థర్ కాటన్ జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్లో కలుసుకున్నారు. తమ చిన్ననాటి విషయాలను జ్ఞాపకం చేసుకున్నారు. 1973 – 74లో పదో తరగతి చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. నాడు చేసిన అల్లరి, ఆటపాటలను గుర్తుచేసుకుని సందడి చేశారు. ఆ పాఠశాలలో ప్రస్తుతం పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ప్రతి ఏటా కలుసుకోవాలని నిర్ణయించారు. పూర్వ విద్యార్థులు అత్తిలి శ్రీనివాస్, విన్నకోట సత్తిబాబు, సుబ్బరాజు, రత్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైలు బోగీ.. కిక్కిరిసి..



చిన్నపాపతో రైలు ఎక్కడానికి అవస్థలు పడుతున్న ప్రయాణికులు

రాజమహేంద్రవరం సిటీ: రైలు ప్రయాణానికి ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రద్దీకి అనుగుణంగా బోగీలు లేకపోవడంతో అవస్థలు ఎదురవుతున్నాయి. రాజమహేంద్రవరం ప్రధాన రైల్వేస్టేషన్‌కు శనివారం మధ్యాహ్నం లింగంపల్లి నుంచి విశాఖపట్నం వెళుతున్న జన్మభూమి ఎక్స్‌ప్రెస్ వచ్చింది. దానికి ముందు భాగంలో రెండు, వెనకాల మరో రెండు జనరల్ బోగీలు ఉంటాయి. కానీ రాజమహేంద్రవరం వచ్చే సరికే అవి నిండిపోవడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు.



జన్మభూమి ఎక్స్‌ప్రెస్ ఎక్కేందుకు స్టేషన్‌లో వేచిఉన్న ప్రయాణికులు

అడుగడుగునా అంతరాయం



ఇన్నీసుపేటలోని వీటీ కాలేజీ రోడ్డుపై ఆవు



దానవాయిపేటలో రోడ్డుకు అడ్డంగా..

రాజమహేంద్రవరంలో వాహనాలకు అడుగడుగునా ఆవులు అడ్డుపడుతున్నాయి. అనధికార స్పీడుబ్రేకర్లలా ఇబ్బంది పెడుతున్నాయి. నగరంలో వాహనాల రద్దీ చాలా ఎక్కువగా ఉంటుంది. రద్దీగా ఉండే ప్రాంతంలో ఆవులను పెంపకందారులు ఇష్టానుసారంగా వదిలేస్తున్నారు. దీంతో ఆవులు, ఆంబోతులు రోడ్డుపై అడ్డంగా పడుకుంటున్నాయి. వీటి వల్ల నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది.

– ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్)

పంట సంరక్షణకు చర్యలు చేపట్టాలి

రాజానగరం: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పలు ప్రాంతాలలో వరి పొలాలు ముంపునకు గురయ్యాయని, తక్షణమే ముంపు నీటిని తొలగించేలా చర్యలు చేపట్టి, పంటను సంరక్షించుకోవాలని దివాన్ చెరువులోని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలలో పర్యటించి, రైతులకు ఇచ్చిన సూచనలు, సలహాలను ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు శనివారం ఇక్కడ విలేకరులకు తెలిపారు. ముంపునకు గురైన పొలాలలో నీరు దిగువకు పోయిన తరువాత బూస్టర్ డోస్ రూపంలో ఎకరానికి 25 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ కలిపి చల్లాలన్నారు. అనంతరం తెగుళ్ల బారి నుంచి పంటను కాపాడుకునేందుకు ఒక లీటర్ నీటిలో కార్బండిజమ్ ఒక గ్రాము కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. ముంపునకు గురైన వరినాట్లు దెబ్బతింటే, నారుకోసం చూడకుండా నేరుగా విత్తనాలను చల్లడం మంచిదని సూచించారు.

సమాచారహక్కు చట్టంపై అవగాహన

కడియం: సమాచార హక్కుచట్టం సామాన్యుడి చేతిలో బ్రహ్మాస్త్రమని గార్డ్స్ ఫర్ ఆర్టీ జాతీయ కన్వీనర్ వరదా నాగేశ్వరరావు అన్నారు. స్థానిక హైస్కూల్లో శనివారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ప్రశ్నించే తత్వాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. మహిళా కన్వీనర్ ఆకుల విజయభారతి మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ద్వారా తాము సాధించిన విజయాలను వివరించారు. ప్రముఖ న్యాయవాది తోరాటి వసంతరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలే ప్రభువులని, వ్యవస్థలోని విషయాలన్నీ తెలుసుకునే హక్కు ప్రజలకు ఉందన్నారు. న్యాయవాది శిరీష మాట్లాడుతూ రాజ్యాంగంలో ప్రతి పౌరుడికి హక్కులతో పాటు విధులను కూడా చేర్చిందని, ప్రతి ఒక్కరూ తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని అన్నారు.. జిల్లా కన్వీనర్ దామిశెట్టి నాగరాజు, ముద్దాల తిరుపతిరావు (అను), హెచ్ఎం టి.సత్యనారాయణ, తెలుగు ఉపాధ్యాయులు గొల్లపల్లి సత్యనారాయణ తదితరులు మాట్లాడారు. అనంతరం గార్డ్స్ ఫర్ ఆర్టీఐ మండల స్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా చిరుకూరి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా ఉండమట్ల ప్రభాకర్, క్రియాశీలక సభ్యులను ఎన్నుకున్నారు.

చైన్ స్నాచింగ్ ముఠా హల్‌చల్

కంబాలచెరువు: నగరంలో శనివారం చైన్ స్నాచింగ్ ముఠా హల్‌చల్ చేసింది. ఉదయం 10 గంటల నుంచి 11.30 వరకూ నడిచివెళుతున్న ముగ్గురు మహిళల మెడల్లోంచి బంగారు ఆభరణాలు తెంచుకుని పారిపోయింది. మూడో పట్టణ, ప్రకాశం నగర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో జరిగిన ఈ సంఘటనలకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. శనివారం ఉదయం 10 గంటల సమయంలో ఆర్ట్స్ కళాశాల సమీపంలోని రైతు బజార్ వద్ద సత్యవతి అనే మహిళ నడిచివెళుతోంది. ఆమె మెడలో బంగారు చైన్‌ను మోటారు సైకిల్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు లాక్కోబోతుండగా ఆమె అప్రమత్తమై గట్టిగా పట్టుకుంది. దీంతో చైన్‌లో సగభాగం ఆమె చేతిలో ఉండిపోయింది. సుమారు నాలుగు కాసుల ముక్కను దొంగలు పట్టుకుపోయారు. అలాగే 10.30 గంటల సమయంలో ఏవీ అప్పారావురోడ్డులో మరో ఘటన జరిగింది. ముగ్ధ షోరూమ్ సమీపంలోని శివాలయానికి వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తున్న రమా జయశ్రీ అనే మహిళ మెడలో 9 కాసుల బంగారు ఆభరణాన్ని మోటారు సైకిల్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు లాక్కుని పరారయ్యారు. అలాగే ఉదయం 11 గంటల సమయంలో దానవాయిపేట డీసీబీ బ్యాంకులో పనిచేస్తున్న మావుళ్లమ్మ సమీపంలోని టీ దుకాణం వద్దకు వెళుతుండగా ఆమె మెడలోని 3 కాసుల బంగారం చైన్‌ను లాక్కుని పారిపోయారు. దీంతో పోలీసులు రంగంలోకి దిగి సంఘటనలు జరిగిన ప్రాంతాల్లోని సీసీ కెమెరాలను పరిశీలించారు. మూడు ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడింది ఒకే వ్యక్తులుగా నిర్ధారించారు. వారిని పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టారు.

నీటి ప్రవాహంలో చిక్కుకుని ఎద్దు మృతి



నీటి ప్రవాహంలో చిక్కుకుని మృతి చెందిన ఎద్దు

సీతానగరం: మండలంలోని చినకొండేపూడి– చీపురుపల్లి మధ్య గల అప్పన్న చావిడి వద్ద ఉన్న కల్వర్టు నీటి ప్రవాహంలో చిక్కుకుని ఎద్దు మృతి చెందింది. సీతానగరానికి చెందిన పేరిచర్ల వెంకట్రాజు శనివారం ఆ కల్వర్టు మీదుగా తన ఎడ్లబండిపై పొలాలకు ఎరువులను తీసుకువెళ్లాడు. తిరిగి వస్తుండగా కల్వర్టులో నీటి ప్రవాహానికి బండి లాగుతున్న ఎద్దులు కంగారుపడ్డాయి. దీంతో ఒక ఎద్దు శీల ఊడిపోవడంతో అది బండి నుంచి విడిపోయిన ఒడ్డుకు వచ్చేసింది. మరో ఎద్దు శీల అలాగే ఉండిపోవడంతో పాటు దాని మెడకు ఉన్న తాడు బిగిసిపోయింది. ఇదే సమయంలో బండి నీటి ప్రవాహంలో కొట్టుకుపోయింది. వెంటనే వెంకట్రాజు కిందకు దూకేశాడు. అనంతరం కొందరి సాయంతో బండిని, ఎద్దును ఒడ్డకు లాక్కునివచ్చారు. కానీ అప్పటికే ఎద్దు మృతి చెందింది.

సినిమాలు



శ్యామల	: రాయన్
సూర్యమినీ	: రాయన్
సూర్యప్యాలెస్	: బడ్డీ
స్వామి	: వివంభజే
అశోక	: కల్కి2898ఏడి
శివజ్యోతి	: అలనాటి రామచంద్రుడు, ఏవరేజ్ స్టూడెంట్ నాని
అనుశ్రీ	: వివంభజే
రాజా	: తిరగబడరాసామీ
రంభ	: ఎటో వెళ్లిపోయింది మనసు, పురుషోత్తముడు
ఊర్వశి	: ఉషాపరిణయం
మేనక	: విరాజ్
కుమారి	: తిరగబడరాసామీ
అప్సర నామవరం	: డెడ్‌పూల్ అండ్ వోల్వరిన్
వీఎస్ మహల్ ధవళేశ్వరం	: వివంభజే
మురళీకృష్ణ కడియం	: బడ్డీ, రాయన్
వెంకటసూర్య	: వివంభజే